## క్లుప్తంగా

### 28 నుంచి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

దర్శి: 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తుకు తెస్తూ దర్శి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 28వ తేదీ నుంచి వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. 28వ తేదీన తాళ్లూరు మండలం, 29వ తేదీన దొనకొండ మండలం, 30వ తేదీన కురిచేడు మండలం, 31వ తేదీన ముండ్లమూరు మండలంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలకు పలు పదవుల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బూచేపల్లి విజ్ఞప్తి చేశారు.

### సైన్స్, బోటనీపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన కెరీర్ ఆపర్చునిటీస్ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ హర్ష భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ మరియు ఆర్ట్స్ గ్రూపుల్లో ఉన్న బిగ్ డేటా, బోటనీ విభాగంలో మెక్కల్లో ఉన్న ఔషధ గుణాలపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధిలో ఉన్న ప్రభుత్వ సహకారాన్ని వివరించారు. అధ్యాపకులు శ్రీనివాసాచారి, విజయబాబు పాల్గొన్నారు.

# చప్టాలకు సైడ్ గోడలు ఏవి?



పుల్లలచెరువు-గారపెంట రోడ్డు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

పుల్లలచెరువు: కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి రహదారులు నిర్మించినా వాటి పక్కన ఉన్న చప్టాలకు మాత్రం సైడు గోడలు నిర్మించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి పక్క గ్రామాలకు వెళ్లేందుకు పీఆర్, ఆర్అండ్‌బీ రహదారులు ఉన్నాయి. పుల్లలచెరువు నుంచి గారపెంట, మర్రివేములకు, వెంకటరెడ్డిపల్లి నుంచి వైపాలెం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూడు చప్టాలు నిర్మించారు. రహదారుకు మరమ్మతులు చేసే సమయంలోగానీ నూతన రహదారులు నిర్మించే సమయంలోగానీ సైడు గోడలు నిర్మించడంలో కాంట్రాక్టర్స్, అధికారులు నిర్లక్ష్యంగా వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు చాలా మంది ప్రమాదాలకు గురై వైద్యశాలకు వెళ్లే వారు చాలా మంది ఉంటారు. మూలమలుపుల్లో చప్టాలు ఉండటంతో కనీసం అధికారులు వీటి సైడు గోడలు ఎందుకు నిర్మించ లేకపోయారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్తున్న వారు అనుకోని విధంగా ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి రహదారులు నిర్మించినా సైడు గోడలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడు గోడలు ఏర్పాటు చేసి మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు పట్టించుకోవాలి**

రహదారులు నిర్మించేటప్పుడు వాటి పక్కన ఉన్న చప్టాలకు సైడు గోడలు నిర్మించక పోవడంతో ఆ రహదారిన వెళ్లే వాహనదారులు చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం గుర్తులు ఏర్పాటు చేసినా ప్రజలు ప్రమాదాల నుంచి రక్షణ పొందే అవకాశం ఉండేది. అధికారులు బాధ్యత మరిస్తే ఎలా?
– కె.కోటిరెడ్డి, రైతు, ఉమ్మడివరం

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సీహెచ్ మౌనిక సూచించారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధి బొద్దికూరపాడు, చింతలపాలెం గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బొద్దికూరపాడు ఎంపీపీ స్కూల్లో డాక్టర్ మౌనిక విద్యార్థులకు ఆరోగ్యపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలతో మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా దోమల ప్రభావం అధికంగా ఉంటుందని, దోమతెరలు, వేపపొగ ఉపయోగించుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీకి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. హెచ్ఈఓ కె.చంద్రశేఖర రావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు .

# దర్శిలో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌లో నటీనటులు



సీన్ వివరిస్తున్న డైరెక్టర్ తోట కృష్ణ

దర్శి: పట్టణంలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో «దక్షిణ కాళీ» అనే సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. శ్రీనిధి క్రియేషన్స్ నిర్మాత వాణి మీసాల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 15 రోజుల పాటు షూటింగ్ ఉంటుందన్నారు. ఆ తర్వాత గోకర్ణం, మైసూరు ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా భక్తి పూర్వకంగా సినిమా నడుస్తుందని చెప్పారు. సినిమాకు డైరెక్టర్‌గా తోట కృష్ణ వ్యవహరిస్తున్నారు. హీరోగా యూట్యూబర్ సుబ్బు, హీరోయిన్‌గా ప్రియాంక, కాళీ అమ్మవారి అవతారంలో అర్చన, జబర్దస్త్ ఫేమ్ కెవ్వు కార్తీక్ తదితరులు సినిమాలో నటిస్తున్నారు. దర్శిలో సినిమా షూటింగ్‌కు చుట్టుపక్కల ప్రాంతాలను పరిచయం చేస్తున్న గణేష్ హనుమంతరావుకు స్థానికులు అభినందనలు తెలిపారు.

# రైతులతో ఎమ్మెల్యే తాటిపర్తి మమేకం



కవలకుంట్లలో రైతులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పుల్లలచెరువు: స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం మమేకమయ్యారు. అనంతరం కవలకుంట్లలో కొద్దిసేపు రైతులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని తెల్లగట్లలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవణారెడ్డి, బాలునాయక్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, జిల్లా యాక్టివ్ సెక్రటరీ డి.వెంకటేశ్వర్లు, గడ్డం సుబ్బయ్య, ఆవులయ్య, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

### బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



సుబ్బారావు (ఫైల్)



సుబ్బారావు మృతదేహం

కురిచేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పల్నాడు జిల్లా వినుకొండలో శుక్రవారం జరిగింది. వివరాలు.. మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఆర్.చిన సుబ్బారావు (40) బంధువుల ఇంట్లో శుభకార్యానికి గురువారం వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత తన ద్విచక్ర వాహనంపై కురిచేడు వస్తూ వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి సుబ్బారావును వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన సీఐ రవిబాబు, శివనాగ ప్రసాద్‌లు పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సుమారు రూ.2 లక్షల విలువ చేసే 4 కిలోల మిర్చి విత్తనాలు, స్టాక్ రిజిస్టర్‌కు నిల్వకు వ్యత్యాసం ఉన్న 11 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ తెలిపారు.

### ద్విచక్ర వాహనాలు వేలం

కంభం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఒంగోలు డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు కంభం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలకు శుక్రవారం వేలం నిర్వహించినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. వేలాన్ని మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకట్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి వేలం వేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

### దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న కరుణానిధి, పక్కన ఎర్రజెండాలతో సీపీఐ యంగ్ టీమ్

దొనకొండ: దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి జిల్లా పశ్చిమ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో యంగ్ కమ్యూనిస్ట్ టీమ్ శుక్రవారం దొనకొండ, రుద్రసముద్రం ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేసింది. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలని, రాష్ట్ర రాజధానిగా దొనకొండ పేరు ప్రస్తావిస్తూ ఆ తర్వాత అమరావతికి మార్చటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో సుమారు 40 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి చేస్తామని పాలకులు చెప్పారని గుర్తు చేశారు. పదేళ్లు దాటినా ఒక పునాది రాయి కూడా వేయక పోవడం శోచనీయమన్నారు. ఈ ప్రాంతంలో కేవలం వర్షాధార పంటలు మాత్రమే పండుతాయని, పరిశ్రమల ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. ఆగష్టు 23న ఒంగోలులో జరిగే సీపీఐ బహిరంగ సభకు స్థానికులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

**విరాళాల సేకరణ**

ఏఐవైఎఫ్ నాయకులు దొనకొండ, రుద్రసముద్రంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కూరేటి బాలయ్య, దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వర రావు, ఏఐఎస్ఎఫ్ దర్శి నియోజకవర్గ కార్యదర్శి స్టాలిన్, శివ, జగదీష్, సాధిక్, కార్తీక్ పాల్గొన్నారు.

### మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలి

రాచర్ల: పాఠశాలల్లోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ వారణాసి గిరిధరశర్మ పేర్కొన్నారు. మండలంలోని రాచర్ల, చోళ్లవీడు గ్రామాల్లోని పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రికార్డులు పరిశీలించిన అనంతరం రాచర్లలోని స్పందన స్కూల్‌ను తనిఖీ చేశారు.



శాకంబరిగా కనకదుర్గమ్మ తల్లి దర్శనం



అమ్మవారికి గుమ్మడికాయలు, నిమ్మకాయలతో పూజలు

### ఘనంగా శాకంబరి ఉత్సవాలు

- కనకదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

దర్శి: రెండు రోజులుగా శాకంబరి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని కూరగాయలతో అందంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.



కుంకుమ పూజకు హాజరైన భక్తులు

# బురదలో నడిచేదెలా..?



బురదమయంగా మారిన పాఠశాల ప్రాంగణం

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కాలంలో మట్టి తోలి మెరక చేయించినా గడచిన నాలుగు రోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారింది. బురదమట్టిని తొక్కుకుంటూ తరగతి గదిలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో తాగునీటి ట్యాంకు ఉండటంతో వృథా నీరంతా చేరి ప్రాంగణంలో బురద ఆరడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పాఠశాల ఆవరణను బాగు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు

### శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వచ్చారు. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో శ్రావణ మాసం ప్రారంభం రోజు శుక్రవారం రావడంతో పెద్ద సంఖ్యలో భక్తజనులు ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయాలను సందర్శించారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. భక్తులకు ప్రసాదాలు, ఆశీర్వచనం అర్చకులు అందించారు.

### విద్యాశక్తి విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

మార్కాపురం: ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రాయవరం, గజ్జలకొండ, తూర్పుపల్లి, గోగులదిన్నె తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. ఎర్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలాడుకోవాల్సిన సమయంలో బలవంతంగా పాఠశాలల్లో కూర్చోబెట్టి చదివించడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, విద్యాశక్తి విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, ప్రభాకర్‌రావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తర్లుపాడు: మండల పరిషత్ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జయరాజ్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధికారులు స్పందించకుంటే దళిత సంఘాల నాయకులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కె.కిశోర్‌కుమార్‌ను, ఎస్సై బ్రహ్మనాయుడును కలిసి దళిత మహిళకు న్యాయం చేయాలని కోరారు.